



చెక్‌పోస్టు వద్ద పోలీసులకు పట్టుబడిన నగదు

కొడికొండ చెక్‌పోస్టు వద్ద భారీస్థాయిలో నగదు స్వాధీనం
వార్త మెయిన్‌పేజీలో...

బియ్యం ధరలు పైపైకి..!

క్వింటాకు రూ.800 భారం
పట్టణంలో ఇష్టా రాజ్యాంగా బియ్యం వ్యాపారాలు
పట్టించుకోని అధికారులు



హిందూపురం పట్టణంలోని బియ్యం దుకాణాలు

ప్రజాశక్తి-హిందూపురం

ఒక వైపు అతివృష్టి....మరో వైపు అనావృష్టి.. వాతావరణంలో మార్పుల కారణంగా ఇటీవల అనేక ఆహార పంటలు దెబ్బతిన్నాయి. దీని ప్రభావం దిగుబడి పైన పడింది. దక్షిణాదిలో ప్రధాన ఆహార పంట అయిన వరిపై తీవ్ర ప్రభావం పడింది. దీంతో ఒక్కసారిగా నెల రోజుల్లోనే బియ్యం ధరలు భారీగా పెరిగాయి. క్వింటలుపై రూ.600 నుంచి 800 వరకు పెరిగినట్లు మార్కెట్లో ధరలు పరిశీలిస్తే తెలుస్తోంది. అయితే ఈ ధరల పెరుగదలతో ఇటు రైతులకు... అటు సామాన్యులకు ప్రయోజనం లేకుండా పోయింది. తగ్గిన దిగుబడుల పేరుతో వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచి, సొమ్ము చేసుకుంటున్నట్లు కనిపిస్తోంది. రైతుల, మిల్లర్ల వద్ద ఎప్పుడో కొనుగోలు చేసిన బియ్యాన్ని ఇప్పుడు ధరలు పెంచడం వెనుక వ్యాపారుల దోపిడినే కారణం అని తెలుస్తోంది.

ఏ వ్యాపారం చేయాలన్న తప్పనిసరిగా ఆయా శాఖల అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఆహార పదార్థాల వ్యాపారులు తప్పని సరిగా అహార భద్రత శాఖ అధికారుల అనుమతులు పొందాల్సి ఉంటుంది. దీంతో పాటు వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపారులు దీంతో పాటు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ నుంచి అనుమతులు తీసుకోవాల్సుంది. దీంతో పాటు ఇతర శాఖల అనుమతులు పొందాలి. అయితే బియ్యం వ్యాపారులు కేవలం వాణిజ్యశాఖ అనుమతులు తీసుకుని, విక్రయదారులకు మాత్రం ఏలాంటి బిల్లులు ఇవ్వకుండా తమ వ్యాపారాలు చేస్తున్నారు. ఎప్పుడైన అధికారులు తనిఖీలు నిర్వహిస్తే ఆ సమయంలో వారిని మేనేజ్ చేసి తమ వ్యాపారాలను ముడు పువ్వులు ఆరు కాయాలుగా చేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. హిందూపురం పట్టణంలో దాదాపు 25 బియ్యం వ్యాపారుల దుకాణాలు ఉన్నాయి. వీటిలో ఒకటిరెండు మినహా మిగిలిన వాటిని అనుమతులు లేవు. అనుమతులు పొందిన వారు సైతం రెన్యూవల్ చేసుకోలేదు. బియ్యం వ్యాపారులు ఆయా శాఖ అనుమతులు తీసుకుంటే పక్కగా వారు తీసుకొస్తున్న స్టాకు వివరాలతో పాటు ప్రతి రోజు ఎంత విక్రయిస్తున్నారన్న వివరాలు లెక్కల్లో చూపించాల్సి ఉంటుంది. అయితే వ్యాపారులు ఏ ఒక్కరికి కొనుగోలు చేసిన దానికి బిల్లులు ఇవ్వక పోవడంతో బియ్యం వ్యాపారాల్లో బ్లాక్ మార్కెటింగ్ ఎక్కువగా జరుగుతున్నట్లు స్పష్టం అవుతోంది.

మార్కెట్ కమిటీ అనుమతులు ఎక్కడ...?

పట్టణంలో వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఉంది. అధికారులు ఉన్నారు. అయినప్పటికి వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపారం చేసే వారు మార్కెట్‌కమిటీ అనుమతులు తప్పని సరిగా తీసుకోవాలి. తమ అనుమతులు తప్పనిసరి అని తెలిసినప్పటికి మార్కెట్ కమిటీ అధికారులు తనిఖీ చేయరు, చర్యలు తీసుకోరు. మార్కెట్ నిబంధనల మేరకు వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపారం చేసే వారు అనుమతులు తీసుకుని, వారి వ్యాపార లావాదేవీలపై ప్రతినెల మార్కెట్ అధికారులకు నివేదికలు ఇవ్వాల్సుంది. అయితే స్థానిక మార్కెట్ అధికారులకు పట్టణంలో వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపార దుకాణాలు ఎన్ని ఉన్నాయో సైతం తెలియక పోవడం విడ్డూరం. కనీసం మార్కెట్ మార్కెట్‌కు వచ్చే చింత పండు, ఎండు మిర్చి సైతం పూర్తి స్థాయిలో తనిఖీ చేసి, ప్రభుత్వ నిబంధనల మేరకు ఈ-నామ్ విదానంలో వ్యాపారాలు జరిగే విధంగా చర్యలు తీసుకోవడం లేదు. మార్కెట్‌లో నుంచి క్రయ, విక్రయాలు జరిగి బయటకు వెళ్లే సరుకును తనఖీ చేయడం లేదు. దీంతో మార్కెట్ ద్వారా ప్రభుత్వనికి అందే శిస్తు సైతం అందడం లేదు. ఈ వ్యాపారాలపై అధికారులు కఠిన చర్యలు తీసుకుని ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి, అందరికి అనుమతులు ఇస్తే ప్రభుత్వానికి ఆదాయంతో పాటు వ్యాపారుల వద్ద ఎంత మేర కొనుగోలు చేస్తున్నారు...ఎంత అమ్ముతున్నారు, మిగిలిన స్టాకు వివరాలు పక్కగా తెలిసే అవకాశం ఉంటుంది. ధరలు పెరిగిన నేపథ్యంలో ఉన్నా పాత ధరలకు సరుకులను ఇప్పించడానికి అధికారులు అవకాశాలు ఉంటాయి.

పట్టించుకోని అధికార యంత్రాగం

ఆహార పంటల వ్యాపారాలపై మార్కెటింగ్ శాఖతో పాటు రెవిన్యూ, వాణిజ్య, ఆహార భద్రత శాఖ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే వ్యాపారులు ఇచ్చే మాముళ్ల తీసుకోని అధికారులు నిస్తేజంగా ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బియ్యం వ్యాపారుల లావాదేవీలపై అధికార యాంత్రాగానికి సరైన సమచారం లేకపోవడంతో పాటు అవినీతి అధికారుల కారణంగా వ్యాపారులు చెలరేగిపోతున్నారు. కనీస అనుమతులు లేకుండా నిత్యావసర వస్తువుల నిలువలపై వ్యాపారులు సమాచారం ఇవ్వకుండా బ్లాక్ మార్కెటింగ్‌కు దిగుతున్నారు. ఇది తెలిసిన అధికారులు నిర్లక్ష్యంగా, నిస్తేజంగా వ్యవహరిస్తున్నారు.



దుకాణంలో నిల్వ ఉంచిన బియ్యం స్టాకు



1. డిఈఈకి వినతి పత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి : సిపిఎం

ప్రజాశక్తి-హిందూపురం

సర్దుబాటు పేరుతో పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని సిపిఎం జిల్లా నాయకులు జడ్పీ శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెంచిన విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా శనివారం సిపిఎం ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించి, విద్యుత్ డిఈఈ కార్యలయం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం డిఈఈ భూతప్పకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వలు సర్దుబాటు పేరుతో ప్రజల నడ్డి విరుస్తున్నాయన్నారు. ఇప్పటికైనా పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, లేకపోతే రైతులు, ప్రజలతో కలిసి పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు నరసింహప్ప, ఎపి రైతు సంఘం అధ్యక్షులు సిద్ధారెడ్డి, రాము, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మల్లికార్జున, కార్యదర్శి పి.జగదీష్, కల్లూర్ ఆటో వర్కర్స్ యూనియన్ కార్యదర్శి నరేష్, రఫిక్, టాటాఎస్ యూనియన్ రియాజ్, మణేసముద్రం ఆటో వర్కర్లు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు బాబయ్య, చంద్ర, బాలాజీ, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

115 మంది చేనేతలకు మగ్గాల పరికరాలు పంపిణీ

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో 115 మంది చేనేతలకు చేనేత మగ్గాల పరికరాలను శాసనసభ్యుడు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, ఎంపీ గోరంట్ల మాధవ్ పంపిణీ చేశారు. శనివారం పట్టణంలోని దీన జనార్ధారణ భవన సముదాయంలో వీటిని పంపిణీ చేశారు. పుట్టపర్తి క్లస్టర్ లోని చేనేతలకు జాతీయ చేనేత జౌళి శాఖ అభివృద్ధి పథకం కింద 212 చేనేత మగ్గాల పరికరాలు జాకార్ట్ అప్టింగ్ మోటర్లు, 240 హుక్స్ జాకార్డులు రాట్నం తదితర పరికరాలు పంపిణీ చేశారు. ఇందులో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆవుటాల రమణ రెడ్డి, చేనేత మరియు జౌళి శాఖ అధికారి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎంపీ మాట్లాడుతూ 90 శాతం సబ్సిడీతో ఇస్తున్న ఈ పరికరాలను చేనేతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ వత్తిలో చేనేతలు నైపుణ్యం పెంపొందించుకొని వస్త్రాల తయారీలో రాలించాలన్నారు. జిల్లా అధికారి రమేష్ మాట్లాడుతూ రూ. 55 వేలు విలువ చేసే పరికరాలు 90 శాతం సబ్సిడీతో పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చేనేతను జౌళి శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



చేనేత పరికరాలను అందజేస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ

సమస్యల పరిష్కారం కోసమే 'జగనన్న సురక్ష'

కలెక్టర్ అరుణ్ బాబు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి మడకశిర రూరల్

సచివాలయాల పరిధిలోని గ్రామాలలో ఏ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందలేదనే మాట వినిపించకూడదని, అర్హులైన వారందరికి వందశాతం సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం 'జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టిందని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని మల్లూరు గ్రామ సచివాలయంలో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. సచివాలయం పరిధిలో ఇప్పటికే 99 శాతం మందికి సంక్షేమ పథకాలు అందాయని, మిగతా ఒకరిద్దరిద్దరు ఉంటే వారికి కూడా సంక్షేమ పథకాలు అందించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం జిల్లా, మండల స్థాయి అధికారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు అందుబాటులో ఉంటారని ఏవైనా సమస్యలు ఉంటే దరఖాస్తులు అందజేయాలని సూచించారు. అదేవిధంగా ప్రజల సమస్యల పరిష్కారం కోసం. 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని, సచివాలయాలకు పదేపదే తిరుగుతూ సమస్య పరిష్కారం కాని పక్షంలో 1902 టోల్ నంబరుకు సమాచారం అందించాలని అన్నారు. సమస్య నేరుగా సీఎం కార్యాలయానికి వెళ్లి పరిశీలించిన అనంతరం కలెక్టర్ కార్యాలయానికి తిరిగి వస్తుందన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులను అప్రమత్తం చేసి సమస్యను పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కార్తీక్, డిఎల్‌డిఒ శివారెడ్డి, సర్పంచి రామలింగమ్మ, సోనిబాయి, డీటీ బాలాంజనేయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రొద్దం : మండలంలోని దొడగట్ట సచివాలయంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో కలెక్టర్‌అరుణ్ బాబు, సబ్ కలెక్టర్ కార్తీక్, డిఆర్‌డిఎ పీడీ నరసింహులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అధికారులు ప్రజల వద్దకు వచ్చి వారి సమస్యలకు పరిష్కారం చూపుతారన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ అనంతాచారి, ఎంపీడీవో రాబర్ట్ విల్సన్, దొడగట్ట ఎంపీటీసీ బాలాజీ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: రొళ్ల మండలంలో జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని కలెక్టర్ అరుణ్‌బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాలంటీర్లు సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకుంటారన్నారు. వాటి పరిష్కారానికి అధికారులు తగిన చర్యలు తీసుకుంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు విజయ రంగే గౌడ్, సర్పంచి రామలక్ష్మమ్మ, ఎంపీడీవో ఆజాద్, ఈవోఆర్డీ కృష్ణప్ప, రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న టిడిపి నాయకులు

వైసిపి దౌర్జన్యాలపై టిడిపి నిరసన

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం అమలు కాలేదని, వైసిపి దౌర్జన్యాలు రాజ్యమేలుతున్నా యని టిడిపి నాయకులు దయ్యబట్టారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం దళితుల పట్ల వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ శనివారం పుట్టపర్తిలో అంబేద్కర్ విగ్రహం దగ్గర నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ, రాష్ట్ర అధికార ప్రతినిధులు రాజశేఖర్ బాబు, బేకరీ గంగాధర, జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, నియోజకవర్గ అధ్యక్షురాలు యశోద మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో దళితుల పట్ల వివక్ష పెరిగిందన్నారు. దళితులను అన్ని రకాలుగా మోసం చేశారన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎస్.గంగాద్రి, రామాంజనేయులు, కేశగాల శీన, సుబ్రహ్మణ్యం, సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'కుష్టు'ను నిర్మూలిద్దాం

ప్రజాశక్తి - లేపాక్షి

కుష్టు వ్యాధి నిర్మూలనే ధ్యేయంగా పనిచేయాలని రాష్ట్ర కుష్టు వ్యాధి నిర్మూలన ప్రత్యేకాధికారి నరసింహారావు సిబ్బందిని ఆదేశించారు. ఆయన శనివారం స్థానిక పిహెచ్‌సిని సందర్శించి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 26 నుంచి జులై 16 వరకు ప్రతి ఇంటికి వెళ్లి కుష్టు వ్యాధి లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రంలో ఎక్కడా కుష్టు వ్యాధి రాకుండా పటిష్టమైన చర్యలు తీసుకొంటున్నామన్నారు. అనంతరం సచివాలయం-1 పరిధిలోని ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి కృష్ణారెడ్డి, డిప్యూటీ డి ఎంహెచ్ఒ మంజువాణి, నోడల్ అధికారి తిప్పయ్యనాయక్, స్థానిక వైద్యులు చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించండి

ప్రజాశక్తి - మడకశిర

నియోజకవర్గం నుంచి జిల్లా కేంద్రమైన పుట్టపర్తికి రావడానికి సరైన బస్సు సౌకర్యం లేదని, కావున ఉదయం, సాయంకాలం సమయాల్లో అమరాపురం మండల కేంద్రం నుంచి వయా గుడిబండ, మడకశిర, పెనుకొండ, కొత్తచెరువు, పుట్టపర్తి, అగలి, రొళ్ల, మడకశిర, పెనుగొండ, కొత్తచెరువు, పుట్టపర్తికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ శనివారం జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంజునాథ్ డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయనతో పాటు ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు శ్రీరాములు, శ్రీనివాసులు, రామాంజనేయులు, సుబ్రహ్మణ్యం, తెలుగు యువత అధ్యక్షులు ఆచారి పాలెం కృష్ణమోహన్, మంజునాథ్, ఐటిడిపి ఉపాధ్యక్షులు శ్రీకాంత్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు రమేష్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పథకాలపై ప్రభుత్వ తీరు సరికాదు

పుట్టపర్తి రూరల్ : సత్యసాయి తాగునీటి పథకానికి స్థానిక సంస్థల నుంచి నిధులు సమీకరించుకోవాలని ప్రభుత్వం ఆదేశా లు జారీ చేయడంపై టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ మండిపడ్డారు. పుట్టపర్తిలో శనివారం ఆయన మాట్లాడుతూ సత్యసాయి తాగునీటి పథకానికి సంబంధించి రూ. 20 కోట్ల పెండింగ్ బిల్లుల చెల్లింపుపై ప్రభుత్వం చేతులెత్తేయడం దురదృష్టకరమన్నారు. ఉమ్మడి అనంతపురం, గోదావరి జిల్లాల్లో సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సురక్షిత తాగునీటి పథకాల నిర్వహణ ఖర్చులను ఇప్పటివరకూ ప్రభుత్వమే భరిస్తోం దన్నారు. సత్యసాయి తాగునీటి పథకాల్లో పెండింగ్ బిల్లులకు జిల్లాస్థాయిలో గ్రామీణ, పట్టణ, స్థానిక సంస్థల నుంచి నిధులు సమీకరించుకోవాలని ప్రభుత్వం సూచించడం తగదన్నారు. తాగు నీటి పథకాల నిర్వహణను స్థానిక సంస్థలే చూసుకోవాలని ఉన్నత స్థాయి సమావేశంలో ఆర్థిక శాఖ స్పష్టం చేసిందన్నారు. కావున వైసిపి ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని తెలిపారు.

'కేతిరెడ్డి' ఓటమే లక్ష్యంగా పనిచేస్తాం : చిలకం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను విమర్శించే స్థాయి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డికి లేదని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని తన నివాసంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ఓటమే లక్ష్యంగా ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసి ఐకమత్యంగా పని చేస్తామన్నారు. పవన్ కళ్యాణ్ గొప్ప లక్ష్యంతో పార్టీని స్థాపించారని ప్రజల పల్లకిని మోసే పార్టీ జనసేన అన్నారు. జగన్ మెప్పు పొంది వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ దక్కించుకునేందుకే కేతిరెడ్డి పవన్ కళ్యాణ్‌ను విమర్శిస్తున్నారన్నారు.

గిరిజనులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

గిరిజనుల సమస్యలు పరిష్కరించడంతో పాటు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని రాష్ట్ర లంబాడీ హక్కుల పోరాట సమితి ఉపాధ్యక్షుడు రవినాయక్ డిమాండ్ చేశారు. ఎల్‌హెచ్‌పిఎస్ ఏర్పడి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శనివారం స్థానిక ప్రశాంతి గ్రామ్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షుడు రవి నాయక్ మాట్లాడుతూ పోరాటాల ఫలితంగా కొన్ని సమస్యలు సాధించుకున్నామని ఆ స్ఫూర్తితో ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు. 500 జనాభా ఉన్న తండాలను గ్రామపంచాయతీగా పూర్తిస్థాయిలో ఏర్పరిచి నిధులు కేటాయించాలన్నారు. ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చరాదన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు విజయ్ కుమార్ నాయక్, నాయకులు కుల్లాయప్ప నాయక్, గోపాల్ నాయక్, రంగా నాయక్, గణేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించాలి

కెవిపిఎస్ నాయకులు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి -పెనుకొండ

ప్రతి నెలా అన్ని మండలాల్లో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించాలని కోరుతూ శనివారం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ఆధ్వర్యంలో డిఎస్‌పి హుస్సేన్‌పీరాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ మాట్లాడుతూ దళితులు వివక్షకు గురవుతున్నారన్నారు. నేటికీ చాలా గ్రామాల్లో రెండు గ్లాసుల పద్ధతి, రచ్చకట్టపై కూర్చోనీయకుండా, ఆలయ ప్రవేశం చేయకుండా అగ్రవర్ణ కులాలు దళితులపై వివక్ష, చిన్నచూపు చూడడం బాధాకరమని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రమేష్, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు యోగానంద, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు నారాయణ, కెవిపిఎస్ నాయకులు రామాంజనేయులు, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం : పల్లె

ప్రజాశక్తి -పుట్టపర్తి అర్బన్

వాతావరణ ఆధారిత పంటల బీమా రైతులందరికీ వర్తింపజేయకుండా వైసిపి ప్రభుత్వం మొండిచేయి చూపించిందని మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి విమర్శించారు. పట్టణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 14 మండలాలకు మాత్రమే వాతావరణ ఆధారిత బీమా వర్తింపజేసి 18 మండలాల రైతులకు అన్యాయం చేశారన్నారు. 3 లక్షలకు పైగా రైతులు వేరుశనగ పంట వేస్తే 80 వేల మందికి మాత్రమే బీమా కల్పించడంపై మండిపడ్డారు. నియోజకవర్గంలో నల్లమాడ మండలానికి మాత్రమే బీమా వర్తింపచేసి మిగతా 5 మండలాలకు అన్యాయం చేసినా స్థానిక ఎమ్మెల్యే కానీ, జిల్లా ప్రజా ప్రతినిధులు కానీ, మంత్రులు కానీ ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. 2019-20కి ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇవ్వాల్సిన దాదాపు రూ. 1,260 కోట్లు ఇన్ పుట్ సబ్సిడీ, వైఎస్ఆర్ జలకళ, సబ్సిడీ డ్రిప్, స్ప్రింక్లర్లు ఎక్కడా ఇవ్వలేదన్నారు. రైతులను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా రైతులకు న్యాయం చేయకపోతే ఈ ప్రభుత్వానికి రైతుల ఉసురు తగులుతుందని హెచ్చరించారు.

ప్రభుత్వాలు రైతులను ఆదుకోవాలి : ఎపి రైతుసంఘం

ప్రజాశక్తి-తనకల్లు

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని ఎపి రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం తనకల్లులో ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రతి రైతుకు ఎకరానికి రూ. 10 వేల ప్రకారం పెట్టుబడి సాయం అందించాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జెవి రమణ మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధర, ధరల స్థిరీకరణ చట్టం, కేరళ తరహాలో రైతు రుణ చట్టాన్ని తీసుకురావాలని కోరారు. 50 ఏళ్ల పూర్తయిన ప్రతి రైతుకు రూ. 10 వేలు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, స్వామినాథన్ కమిషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించని పక్షంలో భవిష్యత్తులో ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.ఇక్బాల్, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు చౌడప్పయాదవ్, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు గిడ్డంగి సౌకర్యం కల్పించాలి : వైసిపి

ప్రజాశక్తి-కొత్తచెరువు

రైతులు పండించిన పంటను నిల్వ ఉంచుకోవడానికి మార్కెట్ యార్డులో గిడ్డంగి సౌకర్యం కల్పించాలని వైసిపి మండల కన్వీనర్ జగన్మోహన్‌రెడ్డి, మేజర్ పంచాయతీ సర్పంచి రాధానాగరాజు కోరారు. కొత్త చెరువులో శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొత్తచెరువు, బుక్కపట్నం, పుట్టపర్తి మండలాల్లో పండ్ల తోటలు అధికంగా ఉన్నాయని, పండ్లను గిట్టుబాటు ధర వచ్చేంత వరకూ నిల్వ ఉంచుకోవడానికి శీతల గిడ్డంగి లేక బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, తదితర మార్కెట్లకు తరలించి తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తుందన్నారు. శీతల గిడ్డంగులు ఏర్పాటు చేస్తే రైతులు అందులో నిల్వ ఉంచుకొని గిట్టుబాటు ధర వచ్చినప్పుడు అమ్ముకుంటార న్నారు. కావున ప్రభుత్వం కొత్తచెరువు మార్కెట్ యార్డులో శీతల గిడ్డంగి పనులను పూర్తి చేసి రైతులకు అందు బాటులోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు వాల్మీకి శంకర్, ఎంపిటిసి సాంబశివరెడ్డి, ఎం.భాస్కర్, వెంకటరాముడు, శివ, మాధవ, తదితరులు పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ మృతి

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి పట్టణం కుటాగుల సమీపం పాలిటెక్నికల్ కాలేజీ మలుపు వద్ద ఆర్టీసీ ఐయర్ అల్ట్రా బస్సు పాల ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఆటోడ్రైవర్ మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు... పల్లెల్లో పాలు సేకరించి కదిరికి తీసుకొస్తున్న ఆటో ను కదిరి నుండి పులివెందుల వెళ్తున్న ఆర్టీసీ ఐయర్ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోడ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు నల్లచెరువు మండలం రాట్నాలపల్లి కి చెందిన రవీంద్ర నాయక్, శారదమ్మల కుమారుడు కార్తీక్(22) గా గుర్తించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చినుకు జాడ కోసం ఎదురుచూపు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లా అంటూ నిత్యం కరువు నిలయంగా చెప్పుకుంటారు. అటువంటి ప్రాంతంలో వాతావరణంలో వచ్చిన మార్పుయో...ఏమోగాని గడిచిన మూడు సంవత్సరాలుగా జిల్లాలో సాధారణం కంటే అధికంగానే వర్షాలు పడుతూ వచ్చాయి. దీంతో కరువు ఛాయలు ఈ కాలంలో తక్కువగానే కనిపించాయని చెప్పవచ్చు. చెరువుల్లోనూ నీటి ఛాయలు కనిపించాయి. వరుసగా పడుతుండటంతో భూగర్భ జలమట్టం సైతం పెరిగింది. దీంతో ఆకాశం వైపు రైతులు ఎదురు చూసే పరిస్థితులు పెద్దగా కనిపించలేదు. అయితే ఈ ఏడాది మాత్రం సీజన్ ఆరంభం నుంచే వర్షాభావ పరిస్థితులు కనిపిస్తుండటం రైతుల్లో గుబులు మొదలవుతోంది. తిరిగి పాతరోజులు రానున్నాయన్నా అన్న ఆందోళన నెలకొంది. వర్షాభావం, కరువు తిరిగి రాబోతున్నదా అన్న గుబుల నెలకొంది. జూన్‌లోనే సీజన్ ఆరంభమైంది. తొలి మాసంలోనే వర్షాభావం నెలకొంది. జూన్ నెలలో సాధారణ వర్షపాతం 61.7 మిల్లీమీటర్లు అనంతపురం జిల్లాలో కురవాల్సి ఉండగా 45.8 మిల్లీమీటర్లు మాత్రమే నమోదయింది. సత్యసాయి జిల్లాలో 67.6 మిల్లీమీటర్లకుగానూ 53.5 మిల్లీమీటర్లు మాత్రమే నమోదయింది. రెండు జిల్లాలోనూ సాధారణం కంటే తక్కువ వర్షాపాతం నమోదయింది. రెండు చోట్ల ఇదే రకమైన వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. జులై మాసం వేరుశనగ సాగుకు మరింత అనువైన సమయం. ఈ మాసంలోనూ వాతావరణ పరిస్థితులు వర్షాభావ పరిస్థితులే కనిపిస్తున్నాయి. జిల్లాలో బలమైన ఈదురు గాలులు నెలకొంటున్నాయి. కారుమబ్బులు కమ్ముకుని వచ్చినా చినుకు జాడ కనిపించడం లేదు. అనంతపురం జిల్లాలో 14 మండల్లాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొని ఉండగా ఆరు మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. సత్యసాయి జిల్లాలో పది మండల్లాల్లో వర్షాభావం, ఎనిమిది మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. సీజన్ ప్రారంభమైనా వర్షాలు సక్రమంగా లేకపోవడంతో వేరుశనగ సాగు చేద్దామా వద్దా అ్న మీమాంస రైతుల్లో నెలకొంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 18 లక్షల ఎకరాల వరకుంటుంది. ఇందులో అత్యధికంగా వేరుశనగ పంటయే. 12 లక్షల ఎకరాలకుపైగా వేరుశనగ పంటయే వర్షాధారం కింద సాగవుతుంది. మంచి పదును అవుతే రైతులు విత్తనం విత్తుకునేందుకు సిద్ధంగానున్నారు. కాని పదును కాక ఆకాశం వైపు ఎదురు చూస్తున్నారు. గతేడాది ఇదే సమయానికి మంచి వర్షాలు పడ్డాయి. దీంతో రైతులు సాగు చేసుకున్నారు. పోయినీడు అధిక వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. దానికి సంబంధించిన పంటలబీమాను ప్రభుత్వం రెండు రోజుల క్రితం ప్రకటించింది. రూ.211 కోట్లు జిల్లాకు వచ్చింది. దీన్ని రైతుల ఖాతాల్లో ఈనెల ఎనిమిదవ తేదిన వేయడానికి అనంతపురం జిల్లాకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి విచ్చేస్తున్నారు. అయితే ఈ పరిహారం ఏ మాత్రం సరిపోదని, రైతులు అత్యధిక మంది అధిక వర్షాలతో పంటలు నష్టపోయి ఉన్నారని, రైతులందరికీ పరిహారం ఇవ్వాలని రైతు సంఘాలతోపాటు, వామపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. జిల్లాలో ఈ సమస్యతోపాటు విద్యుత్ ఛార్జీల పెంపుపైనా వామపక్షాలు ఆందోళనబాట పట్టాయి. ఈ వారంలో జిల్లాలో పెద్దఎత్తున వామపక్షాలు నిరసన చేపట్టాయి. రాబోయే రోజుల్లోనూ ఈ ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించాయి. ఈ టిడిపి బస్సు యాత్ర ఈ వారంలోనూ కొనసాగుతోంది.

ఎపి మెడికల్ కౌన్సిల్ సభ్యులుగా డాక్టర్ మదన్‌కుమార్

కదిరిటౌన్ : ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ సభ్యులుగా కదిరి పట్టణానికి చెందిన చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సివి మదన కుమార్ రెండోసారి నియమితులయ్యారు. కౌన్సిల్ సర్వసభ్య సమావేశం శనివారం ఎపి మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ సాంబశివారెడ్డి అధ్యక్షతన విజయవాడలోని మెడికల్ కౌన్సిల్ హాలులో జరిగింది. ఈ సందర్భంగా ఛైర్మన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు మదన్‌కుమార్ తెలిపారు. మదన్ వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలతో పాటు కరోనా సమయంలో అందించిన ఉత్తమ సేవలకు ఈ గుర్తింపు దక్కింది.

టిడిపి కార్యకర్తకు 'పల్లె' ఆర్థికసాయం

ఓబుళదేవరచెరువు : మండల పరిధిలోని నాయనకోట గ్రామంలో టిడిపి సీనియర్ నాయకులు కె.శ్రీరాములు తల్లి మృతి చెందడంతో శనివారం మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఫోన్ ద్వారా వారిని పరామర్శించారు. అలాగే శ్రీరాములుకు రూ. 5 వేలు అందజేశారు. కార్యక్రమంలో పొగాకు జాకీర్ అహ్మద్, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బడిసం రామాంజనేయులు, శంకర, ఆంజనేయులు, గంగాద్రి, గండికోట ఇర్షాద్, చంద్రాయుడు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచితంగా బస్సుపాసులు

కదిరి టౌన్ : 1వ తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుతున్న విద్యార్థులు ఉచిత, రాయితీ బస్సు పాసుల(3 నెలల) ఖర్చును భరించేందుకు బెంగళూరులో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న పాలెం సుధాకర్ ముందుకొచ్చారు. కదిరి డిపో పరిధిలోని నల్లచెరువు, తనకల్లు, గాండ్లపెంట, నంబూలపూలకుంట, కదిరి, తలుపుల మండలాల్లోని విద్యార్థులకు ఈ సౌకర్యం వర్తిస్తుంది. ప్రతి విద్యార్థి తన స్కూల్ వివరాలను ఎపిఎస్‌ఆర్టీసీ వెబ్ పోర్టల్‌లో కానీ లేక దరఖాస్తు నింపి హెచ్‌ఎం/ప్రిన్సిపల్ చేత సంతకం చేయించుకుని, ఆధార్, ఫొటోలతో బస్టాండ్‌లోని బస్సుపాసు కౌంటర్‌లో ఇచ్చి ఈ ఉచిత/రాయితీ పాసు పొందవచ్చు. మరిన్ని వివరాలకు కంట్రోలర్ ఉత్తన్న, నల్లచెరువు అసిస్టెంట్ మేనేజర్ హరిమోహన్‌ను సంప్రదించాలి

ఘనంగా అంతర్జాతీయ వైద్యుల దినోత్సవం

ధర్మవరం టౌన్ : ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం అంతర్జాతీయ వైద్యుల దినోత్సవాన్ని సూపరింటెండెంట్ నజీర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంచి పెట్టారు. కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ తిప్పేంద్ర నాయక్, డాక్టర్లు పద్మలత, వెంకటేశ్వర్లు, బాలాజీ, కిరణ్, నాగేంద్రప్రసాద్ నివేదిత, వివేక్, సురేఖ, వైష్ణవి పాల్గొన్నారు. అలాగే రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సాంస్కృతిక మండలిలో వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యులు నజీర్, వెంకటేశ్వర్లు, విశ్రాంత కంటి వైద్య నిపుణులు నరసింహులను ఘనంగా సత్కరించి వైద్యుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు రత్న శేఖర్‌రెడ్డి, రమేష్‌బాబు, సుదర్శన్‌గుప్తా, శ్రీనివాసరెడ్డి, కృష్ణమూర్తి, రామకృష్ణ, జయసింహా, శివయ్య, తదితరులు పాల్గొన్నారు..



రోటరీ క్లబ్లో ప్రభుత్వ వైద్యులను సన్మానిస్తున్న క్లబ్ ప్రతినిదులు



ప్రభుత్వాస్పత్రిలో కేక్ కట్ చేస్తున్న డిసిహెచ్ఎస్ తిప్పేంద్ర నాయక్,వైద్యులు

నూతన ఫిజీషియన్‌గా డాక్టర్ తిప్పేంద్రనాయక్



ధర్మవరం టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఫిజీషియన్ వైద్యులుగా తిప్పేంద్రనాయక్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఫిజీషియన్ డాక్టర్ ఇందురేఖ అనంతపురం మెడికల్ కాలేజ్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ప్రమోషన్‌పై వెళ్లారు. దీంతో కదిరిలో పనిచేస్తున్న తిప్పేంద్రనాయక్ ధర్మవరం ఆసుపత్రికి బదిలీ అయ్యారు. అదేవిధంగా సత్యసాయిజిల్లా డీసీహెచ్ఎస్ అదనపు బాధ్యతలు చేపట్టినట్లు తిప్పేంద్రనాయక్ తెలిపారు. ఈయనకు ప్రభుత్వ ఆసుపత్రి సూపర్ డెండెంట్ నజీర్,వైద్యులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

అట్టహాసంగా ఎడ్లబండ్ల పరుగు పోటీలు

సోమందేపల్లి : తొలి ఏకాదశి పురస్కరించుకొని శనివారం మండల పరిధిలోని నాగినేనిచెరువు పంచాయతీలో నిర్వహించిన ఎడ్లబండ్ల పోటీలు అట్టహాసంగా జరిగాయి. సర్పంచి అంజినాయక్, తెలంగాణ టిఆర్ఎస్ నేత శంకర నాయక్, ఎస్ఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పోటీల్లో జిల్లా నలుమూల నుంచి 32 ఎద్దుల బండ్లు పాల్గొన్నాయి. విజేతకు రూ. 20 వేలు, రెండవ విజేతకు రూ. 10వేలు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన విజేతలకు రూ. 5 వేల చొప్పున అందజేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ విజయ్‌కుమార్ పోలీస్ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు అశ్వర్థ, బాబునాయక్, శ్రీనివాసులు, పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న ఎడ్లబండ్లు



డెంగీ నివారణ మాసోత్సవాల్లో పాల్గొన్న అధికారులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

డెంగీ, మలేరియా, తదితర సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి కెసి కుల్లాయప్ప సూచించారు. డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా శనివారం ఆయన మండల పరిధిలోని బీడుపల్లి ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పరిసరాల పరిశుభ్రత, దోమలు, లార్వా గురించి వివరించారు. పరిసరాలు, వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించి జ్వరాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మిదేవి, ఎఎంఓ లక్ష్మీనాయక్, ఎస్‌యుఓ రమణయ్య, ఆరోగ్య కార్యకర్త రాధా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పిల్లలను గుర్తింపు లేని పాఠశాలలో చేర్పించొద్దు

కొత్తచెరువు : గుర్తింపు లేని ప్రయివేటు పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించవద్దని ఇన్‌ఛార్జి డిఇఒ రంగస్వామి శనివారం ఓ ప్రకటనలో తల్లిదండ్రులకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా నిబంధనలు ఉల్లంఘించి అధిక ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్న ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొత్తచెరువులోని శ్రీచైతన్య, నారాయణ పాఠశాలలకు ప్రభుత్వ అనుమతులు లేవని వాటిలో పిల్లలను చేర్పించవద్దన్నా రు. శ్రీచైతన్య పాఠశాలకు ఎలాంటి అనుమతులు లేవని, నారాయణ పాఠశాలలో 1 నుంచి 7వ తరగతి వరకు మాత్రమే అనుమతులు ఉన్నాయ న్నారు. ఈ పాఠశాలలను నిబంధనలకు విరుద్ధంగా నడుపుతూ అధిక ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్నందున సీజ్ చేశామని తెలిపారు.



వైద్య బృందంతో సూపరింటెండెంట్ విజయలక్ష్మి

వైద్య వృత్తి పవిత్రమైంది

కదిరి అర్బన్ : వైద్య వృత్తి మహా పవిత్రమైందని స్థానిక ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ విజయలక్ష్మి తెలిపారు. ప్రపంచ వైద్యుల దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ వైద్యశాలకు నిరుపేదలు ఎక్కువగా వస్తుంటారని, అలాంటి వారికి ప్రేమ, ఆప్యాయతతో మెరుగైన సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం రక్త సేకరణలో ముందున్న వైద్యులను సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు. సమావేశంలో అసిస్టెంట్ డిఎంహెచ్ఓ మైనుద్దీన్, వైద్యులు హుస్సేన్, మున్వర్‌బాషా, సల్మా, సిబ్బంది, ఖాద్రి రక్షక్ సభ్యులు పాల్గొన్నారు.

టిడిపి కమిటీలు ఏర్పాటు

మడకశిర : పట్టణంలో శనివారం మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షులు మనోహర్ ఆధ్వర్యంలో మండల, పట్టణ టిడిపి కమిటీలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సత్యసాయి జిల్లా మైనారిటీ అధ్యక్షుడు భక్తర్, క్లస్టర్ ఇన్‌ఛార్జులు కళ్లుమర్రి నాగరాజు, నరేష్, కన్నా నాగరాజు, ప్రధాన కార్యదర్శి రంగయ్య గౌడ, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు నగేష్, టిఎన్‌టియుసి జిల్లా ఉపాధ్యక్షుడు మురళి, తెలుగు యువత అధ్యక్షుడు మారుతీరెడ్డి, సీనియర్ నాయకులు రవీంద్రారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాత్రికేయుల సమస్యలను పరిష్కరించాలి

పుట్టపర్తి రూరల్: పాత్రికేయుల సమస్యల పరిష్కారంలో ప్రత్యేక చొరవ చూపాలని కలెక్టర్ అరుణ్ బాబును జిల్లా మీడియా ప్రతినిధులు కోరారు. జిల్లాలో చాలా మండలాల్లో సీనియర్ జర్నలిస్టులు పదేళ్లుగా పలు పత్రికల్లో పని చేస్తున్నారని వారందరికీ అక్రిడిటేషన్లు ఇవ్వాలని కోరారు. అలాగే వార, మాసపత్రికలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులతో చర్చించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా అక్రిడిటేషన్ కమిటీ మెంబర్ పుల్లయ్య, సీనియర్ పాత్రికేయులు, తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి టెక్నికల్ కోర్సులకు పరీక్షలు

కొత్తచెరువు : ఈ నెల 3నుంచి 6వ తేదీ వరకు టిటిసి-2023 టెక్నికల్ కోర్సులకు స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి డిఇఓ రంగస్వామి తెలిపారు. డ్రాయింగ్ హ్యాండ్లూం టైలరింగ్ హయ్యర్ గ్రేడ్ కోర్సులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 4:30 వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. హాల్ టికెట్లను వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కదిరి అర్బన్ : గాండ్లపెంట మండల పరిధిలోని కటారిపల్లి గ్రామానికి చెందిన మౌలానా శనివారం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. వివరాలు.. మౌలానా కటారిపల్లి నుంచి సొంత పనిమీద కదిరి పట్టణానికి ద్విచక్ర వాహనంపై వస్తూ ఉండగా కదిరి మండల పరిధిలోని కదిరికొండ వద్ద రోడ్డు ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన వ్యక్తిని వెంటనే స్థానికులు పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పేకాట జూదరులు అరెస్ట్

బుక్కపట్నం : మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు. గ్రామ సమీపంలోని ఆంజనేయ స్వామి గుడి వద్ద పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడులు చేసి 8 మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ. 3,680 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

తనకల్లు : మండల పరిధిలోని గందోడివారిపల్లి గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయి తిరుపతయ్య ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదంలో ఇంట్లోని దుస్తులు, ఫర్నిచర్, ఫ్రిడ్జ్, తిండి గింజలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. తిరుపతయ్య ఆధార్ అప్‌డేట్ కోసం సచివాలయం వద్దకు వెళ్లిన సమయంలో షార్ట్ సర్క్యూట్ కాగా గ్రామంలోని యువకులు తక్షణం స్పందించి నీరు చల్లి మంటలను అదుపు చేశారు. ఈ లోగానే ఇంట్లోని సామగ్రి మొత్తం బుగ్గి పాలైంది. ప్రమాదంలో రూ. 10 లక్షల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

గర్భిణులకు పౌష్టికాహారం తప్పనిసరి

ధర్మవరం టౌన్ : గర్భిణులు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని డాక్టర్ పద్మ సూచించారు. డాక్టర్స్ డే సందర్భంగా శనివారం పట్టణంలోని పుట్టపర్తి రోడ్డులో ఎర్రగుంట వద్ద ఉన్న దేవీ నర్సింగ్ హోంలో గర్భిణులకు ఉచిత స్కానింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పద్మ మాట్లాడుతూ గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం వరకూ చక్కటి పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్య నియమాలు పాటించాలన్నారు. స్కానింగ్ చేయడం వల్ల శిశువు ఆకతి, ఆరోగ్య స్థితి తెలుస్తుందన్నారు. ఆరోగ్యశ్రీ వర్తించే కేసులను అడ్మిషన్ చేసుకొని ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. 60 మంది గర్భిణులకు ఉచితంగా స్కానింగ్ చేయడంతో పాటు ఆరోగ్య విషయంలో జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో దేవీ నర్సింగ్ హోం సిబ్బంది పాల్గొన్నారు.

'భవిష్యత్తుకు గ్యారెంటీ' పథకాలను వివరించండి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

సెక్షన్ ఇన్‌ఛార్జులు తమకు కేటాయించిన ప్రతి ఇంటికీ వెళ్లి హౌస్ మ్యాపింగ్, ఓటరు వెరిఫికేషన్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య సూచించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం పట్టణ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్నందున ఓటరు లిస్టుపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. అలాగే వైసిపి పాలనలో అవినీతి, అరాచకం, కబ్జాలు పెరిగిపోయాయని వాటిని ప్రజలకు వివరించాలన్నారు. ముఖ్యంగా 'భవిష్యత్తుకు గ్యారెంటీ' మినీ మేనిఫెస్టోను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో నాయకులు ఫణికుమార్, కాచర్ల కంచన్న, పురుషోత్తంగౌడ్, పెద్దన్న, నాగూర్ హుస్సేన్, సుధాకర్ పాల్గొన్నారు.

ఎస్‌బిఐ ఖాతాదారులకు అత్యుత్తమ సేవలు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఖాతాదారులకు మరింత ఉత్తమమైన సేవలందిస్తామని పట్టణంలో ఎస్‌బిఐ మెయిన్, మార్కెట్, సిల్క్, టౌన్ బ్రాంచ్ మేనేజర్లు సురేష్, సమీర్ హుస్సేన్, సుధాకర్, సూర్య తెలిపారు. పట్టణంలోని ఎస్‌బిఐ 4 కార్యాలయాల్లో శనివారం ఆవిర్భావ దినోత్సవ వేడుకలను కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. అనంతరం మేనేజర్లు మాట్లాడుతూ ఖాతాదారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. ఎటిఎంల వద్ద డబ్బు డ్రా చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బ్యాంకు అందిస్తున్న వివిధ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని జీవితాన్ని సుఖవంతం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రాఘవేంద్ర, నరసింహారెడ్డి, యూనియన్ లీడర్ పుష్పలత, గోపాల్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

హిందూపురం : పట్టణంలోని 32వ వార్డు బాలాజీనగర్‌కు చెందిన కమలమ్మ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ విషయం తెలిసిన వెంటనే ఆగ్రోస్ ఛైర్మన్ నవీన్ నిశ్చల్ శనివారం తన కార్యాలయంలో ఆమెకు వైద్య ఖర్చుల కోసం రూ. 20 వేలు అందజేశారు.

మంగదిన్నెపల్లికి మట్టి రోడ్డు ఏర్పాటు

కదిరి టౌన్ : తనకల్లు మండల పరిధిలోని మంగదిన్నెపల్లికి రోడ్డు సరిగా లేకపోవడంతో డాక్టర్ బత్తల హరిప్రసాద్ ఆ గ్రామానికి మట్టి రోడ్డు వేయించారు. అలాగే గ్రామంలో ఇటీవల నిర్మించిన దేవాలయానికి విరాళం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి గంగప్పనాయుడు, రమణప్పనాయుడు, జనార్దన్ నాయుడు, అంజనప్పనాయుడు, గంగాధర్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు

ప్రజల వద్దకే పాలన సిఎం జగన్ లక్ష్యం



గోరంట్లలో 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ మంగమ్మ, ఎమ్మెల్యే శంకర నారాయణ, జెసి చేతన్

ప్రజాశక్తి -పెనుకొండ

సీఎం జగన్ ప్రజల వద్దకే పాలన లక్ష్యంగా పని చేస్తున్నారని ఎమ్మెల్యే శంకర నారాయణ తెలిపారు. మండల పరిధిలోని మునిమడుగు సచివాలయం దగ్గర శనివారం 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని నిర్వహించగా ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యేతో ఎమ్మెల్సీ మంగమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల వినతులను సంతృప్తి స్థాయిలో పరిష్కరించడం, ఏ ఒక్కరూ మిగిలిపోకుండా అర్హులందరికీ వివిధ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చే లక్ష్యంతో "జగనన్నకు చెబుదాం" కార్యక్రమానికి అనుబంధంగా చేపట్టిన కార్యక్రమమే "జగన న్న సురక్ష" అన్నారు. ఇందులో భాగంగా 4 వారాల పాటు సచివాలయాల వారీగా ప్రత్యేక క్యాంపులు నిర్వహించి, ప్రజలకు 11 రకాల సేవలను ఉచితంగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ శివశంకరప్ప, తహశీల్దార్ స్వర్ణలత, ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల రూరల్: రాష్ట్రంలో సీఎం జగన్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమైందని ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎంపి గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ మంగమ్మ తెలిపారు. మండల పరిధిలోని వానవోలు గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ చైతన్యతో పాటు వీరు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ స్థాయికి తీసుకెళ్తున్నారని తెలిపారు. ఎంపి మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేశామన్నా రు. అనంతరం లబ్ధిదారులకు 11 రకాల సేవలకు సంబంధించిన పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



హిందూపురంలో ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కమిషనర్ ప్రమోద్‌కుమార్

చెన్నేకొత్తపల్లి : వివిధ సంక్షేమ పథకాల ద్వారా జగనన్న మనందరినీ రక్షించుకుంటున్నారని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. 'జగనన్న సురక్ష'లో భాగంగా మండల పరిధిలోని కనుముక్కల గ్రామంలో ఎమ్మెల్యే లబ్ధిదారులకు 247 ఇళ్ల పట్టాలతో పాటు కుల, ఆదాయం, ఫ్యామిలీ మెంబర్, మ్యారేజ్, ఆధార్, తదితర సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జడ్‌పి ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ప్రజాప్రతినిధులు, వైసిపి మండల కన్వీనర్లు, నాయకులు, గృహ సారథులు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

నల్లచెరువు : ప్రజల కోసం చేపట్టిన బృహత్తర కార్యక్రమమే 'జగనన్న సురక్ష' అనిఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని అల్లుగుండు గ్రామ సచివాలయంలో నిర్వహించిన 'జగనన్న సురక్ష' కార్యక్రమం లో ఎంపిడిఓ శకుంతల, తహశీల్దార్ రవికుమార్, ఎంపిపి రమణారెడ్డి, సింగిల్ విండో ప్రెసిడెంట్ జయచంద్ర రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓబులదేవరచెరువు : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సూచించారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయం తో పాటు, సచివాలయం-1 పరిధిలోని కొండకుమార్ల డబురువారిపల్లి, మిట్టపల్లి తంగేడుకుంట, అల్లాపల్లి గ్రామాల్లో సచివాలయాల వద్ద నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు వివిధ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి పర్వీన్‌బాను, జడ్పిటిసి కుర్లి దామోదర్ రెడ్డి, షామీర్‌బాషా, తుమ్మల బాబా, , రాజునాయుడు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి, అర్హులందరికీ లబ్ధి పొందేలా సేవలు అందించాలని ఎంపిడిఓ సౌజన్యకుమారి సూచించారు. కునుతురు సచివాలయంలో సర్పంచి సత్యమయ్య అధ్యక్షతన 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి పాటిల్ కృష్ణారెడ్డి, మండల ప్రత్యేకాధికారి చాంద్ బాషా లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డి మమతా దేవి, సూపరింటెండెంట్ నబిరసూల్, పంచాయతీ కార్యదర్శి సువర్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లేపాక్షి : స్థానిక సచివాలయం-1లో సర్పంచి ఆదినారాయణ అధ్యక్షతన మండల ప్రత్యేకాధికారి సుదర్శన్‌బాబు లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఓ నరసింహనాయుడు, తహశీల్దార్ బాబు, డిప్యుటీ తహశీల్దార్ కుమార్‌రెడ్డి, జడ్పిటిసి సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, ఈఓఆర్‌డి శివన్న, వైసిపి మండల కన్వీనర్ నారాయణస్వామి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తచెరువు : ప్రజలకు మెరుగైన సేవలందించడమే ప్రభుత్వ ధ్యేయమని మండల ప్రత్యేకాధికారి శివరంగప్రసాద్ తెలిపారు. కొత్తచెరువులోని సచివాలయం-1, 2 పరిధిలోని ప్రజల కోసం శనివారం 'జగనన్న సురక్ష' గ్రామ సభ లు నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై దరఖాస్తు చేసుకున్న ప్రజలకు ఉచితంగా సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాధా నాగరాజు, ఎంపిడిఓ సిద్ధారెడ్డి, తహశీల్దార్ రామాంజనేయరెడ్డి, ఎఓ నటరాజు, హౌసింగ్ ఏఈ రమణారెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ స్వాతి, మేజర్ పంచాయతీ కార్యదర్శి గోపాల్, సచివాలయ సిబ్బంది, వైసిపి మండల కన్వీనర్ జగన్ మోహన్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు



గుడ్డివెలగల గ్రామంలో ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

సోమందేపల్లి : 'జగనన్న సురక్ష'లో భాగంగా మండల పరిధిలోని గుడిపల్లి సచివాలయంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా ఎంపిపి గంగమ్మ వెంకటరత్నం, మండల ప్రత్యేకాధికారి అశ్వత్థామ నాయక్, ఎంపిడిఓ నాగరాజురావు, తహశీల్దార్ సురేష్ హాజరయ్యారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నాగార్జున్‌రెడ్డి, వాసంతి, వీఆర్వో ఓబులేష్, సచివాలయ ఉద్యోగులు శ్రీదేవి, నాగజ్యోతి, భారతి, గీతమ్మ, బాలకృష్ణ, అశ్వర్థ, వైసిపి మండల కన్వీనర్ నారాయణరెడ్డి, సర్పంచులు గిరిజమ్మ నాగరాజురావు, అంజి నాయక్, సచివాలయం కన్వీనర్ హిమామ్ వలి, ఆశా వర్కర్లు వాలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండల పరిధిలోని దొరిగల్లు, ఉప్పలపాడు గ్రామాల్లో 'జగనన్న సురక్ష' ద్వారా లబ్ధిదారులకు వివిధ రకాలు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఓ విజయలక్ష్మి, తహశీల్దార్ నాగేంద్ర, డిప్యూటీ తహశీల్దార్ ప్రసన్న కుమార్, వైసిపి నాయకులు ఇందుకూరు నారాయణరెడ్డి, సచివాలయ కన్వీనర్ మల్లగుండ్ల భాస్కర్, వైస్ ఎంపిపి వెంకటేశ్వర్‌రెడ్డి, జడ్పిటిసి తిరుమల సేవేనాయక్, కిరణ్, ప్రజలు పాల్గొన్నారు.



ఓబుళదేవరచెరువులో కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

బుక్కపట్నం : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపిపి శ్రీధర్‌రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని గసిగవారిపల్లి పంచాయతీలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపిడిఓ శ్రీనివాసులు, తహశీల్దార్ కరుణాకర్, సర్పంచి గోవిందరెడ్డి, సచివాల య కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, ఈఓఆర్‌డి ఇందిరాబాల, వైసిపి మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

హిందూపురం : పురపాలక సంఘం వ్యాప్తంగా ఈ నెల 4 నుంచి ప్రారంభమవుతున్న 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వార్డు వాలంటీర్లు కలిసి విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ సూచించారు. ఆయన శనివారం పట్టణంలోని వివిధ సచివాలయాలను సందర్శించి ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. అనంతరం ఇదే విషయంపై మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డిఈఈలు, ఎఈలు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : మండల పరిధిలోని గుడ్డివెలగల సచివాలయంలో ఎమ్మెల్యే సిద్ధారెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ యాదవేంద్ర, డిప్యూటీ తహశీల్దార్ రవి, ఎంపిపి టి.జగన్మోహన్, భాస్కర్ రెడ్డి, సర్పంచులు, సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని నిడిమామిడి గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ సుబ్బదాస్, తహశీల్దార్ నవీన్ కుమార్, ఎంపిడిఓ అశోక్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం జడ్పిటిసి లక్ష్మీనరసమ్మ చేతుల మీదుగా లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి బాలులత, వైస్ ఎంపిపి కెసి రంగన్న, వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.